కడప గడపలో.. ఎవరిదారి వారిదే..!



- సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం కట్టబెట్టిన జిల్లావాసులు
- రాబోవు ఎన్నికల నాటికి పార్టీని పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దేందుకు మంచి అవకాశం
- అయితే నేతల మధ్య సమన్వయలోపం
- కార్యకర్తలను గాలికొదిలేసిన వైనం
- వైసీపీ విమర్శలకు దీటుగా జవాబు ఎక్కడ?
- పార్టీని ఏకతాటిపై నడిపించే నాయకత్వం కరువు
- ఇదీ జిల్లాలో టీడీపీ పరిస్థితి
- నేడు సీఎం చంద్రబాబు రాక

కడప గడ్డ.. 2004 మునుపు వరకు టీడీపీకి కంచుకోటలా ఉండేది. 2004 తరువాత జరిగిన ఎన్నికల్లో పార్టీ దెబ్బతింటూ వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ పార్టీకి పూర్వవైభవం వచ్చి కడప గడ్డను పసుపుగడ్డగా మార్చారు. ఉమ్మడి జిల్లాలో కూటమికి జనం బ్రహ్మరథం పట్టారు. పది అసెంబ్లీ స్థానాలకు 7 చోట్ల కూటమిని గెలిపించారు. కడప పార్లమెంటు పరిధిలో ఐదింటిని కూటమి గెలుచుకుంది. ఇందులో నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇంత ఘన విజయాన్ని సొంతం చేసుకున్న పార్టీ రాజకీయంగా మరింత బలపడేందుకు మంచి అవకాశం వచ్చింది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉంది. అయితే జిల్లా టీడీపీ నాయకత్వం చేతులెత్తేసింది. ఎమ్మెల్యేల మధ్య, ఇన్‌చార్జిల మధ్య సఖ్యత లేదు. ఎవరి దారి వారిదిలా తయారైంది. దీనికి తోడు కార్యకర్తలను కూడా గాలికొదిలేశారు. హైదరాబాదులో ఉంటూ వీకెండ్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతున్నారు. నేడు జిల్లాకు వస్తున్న సీఎం చంద్రబాబునాయుడు జిల్లా టీడీపీపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప పార్లమెంటు పరిధిలో గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగింటిని టీడీపీ గెలుచుకోగా జమ్మలమడుగును బీజేపీ గెలుచుకుంది. అయితే.. ఈ ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదు. అలాగే ఇన్‌చార్జిల మధ్య కూడా సఖ్యత లేదు. పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించే వారు కరువయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడు నెలలకొకసారి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించేవారు. అధికారంలోకి వచ్చాక సమావేశాల ఊసే లేదు. జిల్లాలో మహానాడు సమయంలో, సీఎం చంద్రబాబు, లోకేశ్ పర్యటించినప్పుడు మాత్రమే జిల్లా నేతలంతా ఒకేచోట హాజరవుతున్నారు. తర్వాత ఆ పరిస్థితి లేదు. వైసీపీ కన్నా మించి సంక్షేమాన్ని చంద్రబాబు ప్రభుత్వం చేపడుతోంది. దీనిని జనాల్లోకి తీసుకురావడంలో కొందరు విఫలమవుతున్నారు. వైసీపీ విమర్శలకు సరైన కౌంటరు ఇవ్వలేక పోతున్నారు. వైసీపీ తప్పిదాలను కూడా ఎండగట్టలేక పోతున్నారు.

వీకెండ్ పాలిటిక్స్

నిత్యం జనాలతో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పదే పదే చెబుతున్నా జిల్లాలో కొందరు నాయకులు లైట్ తీసుకుంటున్నారు. హైదరాబాదులో ఉంటూ వీకెండ్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఒక ఎమ్మెల్యే వారంలో ఒకసారి జిల్లాకు రావడం, ప్రభుత్వ కార్యక్రమాలు చూసుకోవడం వెంటనే హైదరాబాదు వెళ్లిపోవడం. మరో ఎమ్మెల్యే కూడా వస్తే రెండు మూడురోజులు ఉండి మరలా హైదరాబాదు వెళుతున్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదు. ఇన్‌చార్జిల్లో కూడా ఒకరు మినహాయిస్తే మిగతా వారు జిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతున్నారు. జిల్లాలో పార్టీని పటిష్ఠం చేద్దామనే ధ్యాస లేదు.

ఇక కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఎన్నికలకు ముందు పార్టీ జెండా మోసిన వారికి అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యం తగ్గింది. వలస పక్షులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓ రెండు నియెజకవర్గాలు మినహాయిస్తే మిగతా నియోజకవర్గాల్లో వలసపక్షులకే ప్రాధాన్యం పెరిగింది. యువగళం పాదయాత్రలో భూకబ్జాలపై నారా లోకేశ్ నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే భూ కాలకేయుల భరతం పడతామని హెచ్చరించారు. అయితే ఓ ఇన్‌చార్జి వైసీపీ నేతలతో కుమ్మక్కయ్యి భూకబ్జాలపై చర్యలు లేకుండా చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

ఆరునెలల్లో పార్టీ కార్యాలయం.. ఏదీ?

టీడీపీ సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నా జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం లేదు. వైసీపీ ఐదేళ్లలోనే రాజభవనం తలపించే విధంగా కడపలో కార్యాలయం నిర్మించుకుంది. 2014-19 సమయంలో టీడీపీ కార్యాలయం కోసం స్థలం కేటాయించారు. దీని నిర్మాణం విషయంలో అప్పుడు నేతలు పట్టించుకోక పోవడంతో.. వైసీపీ వచ్చాక ఆ స్థలాన్ని రద్దు చేశారు. మరలా ఇప్పుడు స్థలం కేటాయించారు. ఈ ఏడాది జనవరి 20న మైదుకూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అప్పుడు జిల్లా టీడీపీ నేతలు కడపలో పార్టీ కార్యాలయం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు బ్రోచరును విడుదల చేశారు. 18 నెలల్లో పార్టీ కార్యాలయాన్ని పూర్తి చేస్తామని సీఎం వెల్లడిస్తే.. లేదు, లేదు ఆరునెలల్లోనే పూర్తిచేస్తామని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చంద్రబాబు సాక్షిగా ప్రకటించారు. ఆరు నెలలు కాదు.. పది నెలలువు అవుతున్నా అక్కడ కాంపౌండు, చిన్న షెడ్డు మాత్రమే వేశారు తప్ప నిర్మాణానికి నోచుకోలేదు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

కమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలానికి బుధవారం సీఎం చంద్రబాబునాయుడు విచ్చేస్తున్నారని ఈ పర్యటనలో ప్రతి టీడీపీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది రైతులున్న కమలాపురం నియోజకవర్గాన్ని సీఎం ఎంచుకోవడం చాలా సంతోషకరమన్నారు. సీఎం పుట్టపర్తి నుంచి నేరుగా వెల్లటూరులోని ఉన్నతపాఠశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్ చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి వెల్లటూరులోని మన గ్రోమోర్ కేంద్రం, ఎరువుల దుకాణానికి చేరుకుని నియోజకవర్గంలోని రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు, సమస్యలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తారన్నారు. అనంతరం పెండ్లిమర్రిలోని ప్రజావేదికకు చేరుకుని 'పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ' పథకం నిధులను విడుదల చేస్తారన్నారు. రైతులతో ముఖాముఖీ మాట్లాడేందుకు చిన్నదాసరిపల్లెకు ట్రాక్టరుపై వెళ్లి



పొలాలను పరిశీలిస్తారన్నారు. అక్కడ రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపుతారన్నారు. సాయంత్రం వెల్లటూరులో భారీ సమావేశం ఉంటుందన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై సీఎం పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం



ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలసి పొలాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కడప / పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని బుధవారం పెండ్లిమర్రిలో ప్రారంభించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి , ఏపీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయశాఖ కమిషనర్, ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మునజీర్, సమున్‌జిలాన్‌తో కలిసి సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, భైరవగుట్ట వద్ద ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రం ఏర్పాట్లు, వెల్లటూరులోని గ్రోమోర్ ఫెర్టిలైజర్ సీడ్స్ చిన్నదాసరిపల్లెలో పంట పొలాలను, జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకండా పకడ్బందీగా చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జేడీ కృపాదాస్, ఆర్డీవోలు చంద్రమోహన్, జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, డ్వామా, మెప్మా పీడీలు ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు ఎంఆర్ నాయుడు, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి రూ.31.35 కోట్లు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం పెండ్లిమర్రిలో పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతలో 46.85లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.31.35 కోట్ల నిధులు జమకానున్నాయి. సీఎం చంద్రబాబు గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి అన్నదాత పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల చేస్తారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు జమ కానుంది.

పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు : ఎస్పీ



బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం పెండ్లిమర్రి మండలంలోని చిన్న దాసరిపల్లె, వెల్లటూరు పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన బందోబస్తు ఏర్పాట్లపై పగడాలపల్లెలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులకు దిశనిర్దేశం చేశారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. వెల్లటూరులోని హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్ మార్గం, ప్రజావేదిక ప్రాంతాల పరిసరాలు, రూట్ బందోబస్తు విధులు నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ వచ్చే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి సీఎం పాల్గొనే కార్యక్రమ ప్రాంతం వరకు కాన్వాయ్ రిహార్సల్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, రమణయ్య సీఎం సెక్యూరిటీ అధికారి ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసం పోరాటం తప్పదు

కమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సామాజికన్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేయక తప్పదని సీపీఐ జిల్లా కార్య వర్గస భ్యుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం దళిత,గిరిజన, మైనార్టీలపై దాడులు నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.

యువత మత్తుకు బానిసలు కావద్దు

కడప క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని డిజబిలిటీ ఏడీ క్రిష్ణకిశోర్ అన్నారు. నషాముక్త్ భారత్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ఉక్కాయపల్లె సాయికృప నర్సింగ్ కాలేజీలో మంగళవారం నర్సింగ్ విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవిద్య, అధ్యాపకులు, విద్యార్థులు , డీడీఏసీ సిబ్బంది, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ సిబ్బంది అయుబ్‌ఖాన్, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలల కొన్ని హక్కుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్.సుభాష్‌యాదవ్ అన్నారు. మహిళా,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని శ్రీబాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలోని పిల్లలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల, చట్టాల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసరు సునీత, ప్రొటెక్షన్ ఆఫీసరు ఎన్ఐసీ క్రిష్ణప్రతాప్, కే.యూనస్‌బాషా (అవుట్ రీచ్ వర్కర్) , కళాశాల సిబ్బంది, పిల్లలు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తుకు అడ్డుకట్ట

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :యుక్తవయసుల రాకుండానే చదువుకునే వయసులో తల్లిదండ్రులు తొందరపడి తమ ఆడబిడ్డలకు బాల్యవివాహాలు నిర్వహిస్తే అవి భవిష్యత్తులో అడ్డుకట్టగా మారుతాయని సీడీపీవో శాంతమ్మ అన్నారు. బేటి బచావో, బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామనపల్లెలో మంగళవారం బాల్యవివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపడీవో కిరణ్‌మోహన్‌రావు, అంగన్వాడీ సూపర్‌వైజరు గురమ్మ, ఎంఈవో గంగిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గన్నారు.

భూమి సారవంతాన్ని పెంచాలి

పులివెందుల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో భూమి సారవంతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీ అశోక్‌రెడ్డి, పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు వాడకం వల్ల భూమి సారవంతం తగ్గుతోందన్నారు. రబీ సీజన్‌కు 50శాతం సబ్సిడీలో వివిధ రకాల క్రిమిసంహారక మందులు జింక్, జిప్సం,వేపనూనెను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏవో చెన్నారెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలు లేనిదే భవిష్యత్తు లేదు



మాట్లాడుతున్న శ్రీవాణి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు లేనిదే భవిష్యత్తు లేదని ఐసీడీఎస్ కడప సీడీపీవో శ్రీవాణి అన్నారు. నగరంలోని ఏఎస్ఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల లో బేటీ బచావో బేటి పఢావో మండల స్థాయి సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల అభివృద్ధికి ఆటంక పరిచే ఎటువంటి చర్యలు చేయకూడదన్నారు. బాలల పరిరక్షణ విభాగం లీగల్ కమ్ ప్రొబెషన్ ఆఫీసరు సునీతరాజు మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం జేజే చట్టం, పోక్సో చట్టం, బాల్యవివాహ చట్టం వంటి వాటితో పాటు మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శోభారాణి ,అంగన్వాడీ, ఆశా వర్కర్స్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆసరాగా నిలవాలి

సీకేదిన్నె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులు అన్నదాతకు ఆసరాగా నిలువాలని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే మంగళవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్త సునీల్‌కుమార్, శాస్త్రవేత్తలు శ్రీవల్లి, మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతమవుతున్న ఆశాలు

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాపితంగా గల ఆశా కార్యకర్తలు కనీస వేతనాలు లేక చాలీచాలని వేతనాలు పలు సమస్యలతో సతమతమవుతున్నారని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటు ఉద్యోగ భద్రత లేక, అటు రాజకీయ నాయకుల, అధికారుల వేధింపులు తట్టుకోలేక వారు చెప్పిన పనులు చేయలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు.సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాపితంగా జన గణనతో పాటే సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించిన జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్‌లను చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లో గల బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలలో భాగంగా చట్టసభలలో 33శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా ముందుగా కుల గణన చేయడం తప్పనిసరి అన్నారు. సమావేశంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంబోధర, హెచ్‌ఆర్‌డబ్ల్యూ రాయలసీమ అధ్యక్షుడు జె.వి.రమణ, పాల్గొన్నారు.

'ఆర్టీసీలో నిబంధనలకు పాతరేస్తున్న ఆర్ఎం'



దీక్షలో మాట్లాడుతున్న శివారెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నిబంధనలకు పాతరేసేలా ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ (ఆర్.ఎం) విధులు నిర్వహిస్తూ ఆన్‌కాల్ డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసుల డ్యూటీలకు పంపిస్తున్నారని ఆర్టీసీ ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్, కడపజోన్ అసిస్టెంట్ సెక్రటరీ కోడూరు సుబ్బారావు, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు తొండలదిన్నె జయరామ్, సగినాల శ్రీనివాసులు ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసంగా మంగళవారం ఆర్టీసీ ఆర్.ఎం కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదటి రోజు దీక్షలలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు (కండక్టర్లు) పద్మావతమ్మ, సుజాత, సుబ్బమ్మ, నాగలక్ష్మి తదితరులున్నారు. కార్యక్రమంలో అన్ని డిపోల గ్యారేజీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదు : టీడీపీ

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప నగర ప్రజల బాగు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఆర్. మాధవిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని తెలుగుదేశం పార్టీ నగర నాయకులు అశోక్‌రెడ్డి, సిలాస్, సుబ్బరాయుడు, రెడ్డయ్య, ఎస్. యూనస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ నాయకులు ఎమ్మెల్యే మాధవిపై అవాకులు చెవాకులు వాగడం మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా మహిళలను కించపరిచే వాఖ్యలు తగదన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రదోషకాల పూజలు



చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో కొలువైన మల్లేశ్వరాలయంలోని నందీశ్వరునికి కార్తీక మాసం చతుర్ధశి సందర్భంగా మంగళవారం సాయంత్రం ప్రదోషకాల పూజలను వైభవంగా నిర్వహించారు. స్థానిక మహిళలు పూజా సామగ్రిని నందీశ్వరునికి, మల్లేశ్వరునికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు నందీశ్వరుని పుట్టుక, ఆయన జన్మవృత్తాంతాన్ని శివునికి వాహనమైన విధానాన్ని వివరించారు. అలాగే వచ్చిన మహిళల చేత నందీశ్వరునికి అభిషేకాలు చేయించారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ

వల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని పుల్లారెడ్డిపల్లె గ్రామంలో నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గురుస్వాములు ఆధ్వర్యంలో శరణుఘోషలు నిర్వహించి భజన పాటలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి పడిపూజను కన్నులపండువగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



కడప నగరం బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు, అమ్మవారు(అంతరచిత్రం)



మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

నేటి నుంచి సత్యసాయిబాబా శతజయంతి

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను వేంపల్లెలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 23వ తేదీ వరకు పలుకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చివరి రోజు నగర సంకీర్తన, గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు నగరంలో ఏక్తా యాత్ర

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వల్లబాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏక్తా దివస్ ఉత్సవాలలో భాగంగా ఈనెల 20వ తేదీ గురువారం కడపలో ఏక్తా దివస్ యాత్ర జరుగనుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేవైయం రాష్ట్ర నాయకుడు బత్తల పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్‌జీవో కాలనీ సభా ప్రాంగణం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకూ ఏక్తా దివస్ ర్యాలీ సాగుతుందన్నారు. ఈ సమావేశంలో అశోక్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి

పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రచ్చబండ, అన్నదాత సుఖీభవ కార్యక్రమం కోసం బుధవారం మండలానికి వస్తున్న సందర్భంగా పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. వెల్లటూరు, చిన్న దాసరిపల్లె, పెండ్లిమర్రి సమీపంలో జరిగే రచ్చబండ కార్యక్రమాలలో రైతులు,యువకులు,మహిళలు,కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సచివాలయ వ్యవస్థ ప్రజలకెంతో కీలకం: ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ ప్రజలకెంతో కీలకమైనదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల పనితీరు, వివిధ కార్యకలాపాలపై అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఉలిమెల్ల, చెన్నారెడ్డికాలనీ, గుంతబజార్ తదితర సచివాలయాలను ఆయన సందర్శించారు. అక్కడ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైసూరారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో అద్దాలు ధ్వంసం

కడప క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రవీంద్రనగర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో అద్దాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. రవీంద్రనగర్‌కు చెందిన ముక్తియార్ ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరి రాత్రి ఇంటి ముందు ఆటోపార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వారు ఆటో అద్దాలను పగలగొట్టారు. గంజాయిమత్తులో కొంత మంది యువత అర్ధరాత్రుల్లో తిరుగుతూ ఇలాంటి చేష్టలుచేస్తున్నారని, అధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు తెలిపారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష రద్దు చేయాలని కోరుతూ ఎస్టీయూ ఏపీ కడప జిల్లా శాఖ ప్రతినిధులు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిని కడపలో తన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 23 సవరణ కోసం కేంద్రాన్ని ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్టీయూ రాష్ట్ర జిల్లా నాయకులు, పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగ విద్యార్థులకు స్క్రీనింగ్

పులివెందుల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన దివ్యాంగ విద్యార్థులకు సహాయ పరికరాల స్క్రీనింగ్ శిబిరం ఉంటుందని దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పులివెందులలోని పాతబస్టాండ్ సమీపంలోని సత్రంబడి పాఠశాలలో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. 18లోపు వయసు ఉన్న చూపు, మాట, వినికిడిలోపం, శారీరక, మానసిక వైకల్యం గల దివ్యాంగులైన విద్యార్థులకు అలింకో డాక్టర్లచే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, చంకకర్రలు, చేతికర్రలు, రొలేటర్లు, వాకర్లు, బదిరులకు చెవిటిమిషన్లు, అంధులకు చేతికర్రలు, మానసిక వికలాంగులకు ఎంఆర్‌కిట్స్ తదితర సహాయ ఉపకరణాలు అందించేందుకు వైద్యబృందంచే వికలాంగులకు స్క్రీనింగ్ నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. తమ సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డులు,యూడీఐడీ కార్డు, జిరాక్స్‌కాపీలతో,రెండు వైకల్య ఫొటోలతో గురువారం సత్రంబడిలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 92473 39815 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు

● మండలస్థాయిలో 29, 30 తేదీలలో ● డివిజన్ స్థాయి డిసెంబరు 13, 14 తేదీలలో...
● జిల్లాలో 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు ● సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా, మరింత ఉత్సాహంగా బోధన చేసేలా శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా ప్రభుత్వం ఆటలపోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈనెల 16వ తేదీన ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళ టీచర్లకు త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. తొలుత మండల స్థాయి తర్వాత డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ బాధ్యతలను మండలస్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌కు అప్పగించారు.

మండల స్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లాస్థాయిలో డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి జేడీ స్థాయిలో అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండలస్థాయి జట్లను ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్‌జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్లను ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆటలపోటీల వివరాలు

మండలస్థాయిలో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీలలో, జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీలలో రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీలలో నిర్వహిస్తారు. ఈ ఆటల ద్వారా ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వం, ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడిని తగ్గించడం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వినోద కార్యక్రమాలకు వేదికను అందించడంతో పాటు క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. అన్ని కేడర్లలోని ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, స్నేహాన్ని బలోపేతం చేయడం, ఆటలలో చురుకుగా పాల్గొనడంలో విద్యార్థులకు ఒక ఉదాహరణగా నిలిచి వారిని ప్రేరేపించడం ముఖ్య లక్ష్యాలుగా ఈ ఆటలు పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలో 36 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో పాటు, జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి రూ.5వేల చొప్పున 36 మండలాలకు రూ.1.80లక్షలు, ప్రతి డివిజన్‌కు రూ.20వేల చొప్పున మూడు డివిజన్లకు రూ.60వేలు విడుదల చేయనున్నారు. జిల్లాస్థాయిలో పోటీలకు రూ.20వేలు నిర్వహణ బడ్జెట్ కూడా కేటాయించారు. దీనిపై ప్రత్యేక ఉత్తర్వులు విద్యాశాఖ విడుదల చేసింది.

మానసిక ఉల్లాసం కలిగించేందుకు



ఉపాధ్యాయులు అలసట నుంచి బయటకు వచ్చేందుకు ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయం. ఉపాధ్యాయులకు కూడా పోటీతత్వం అలాగే మానసిక ఉల్లాసం శరీర దృఢత్వానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది.

- ఎస్.షంషుద్దీన్, డీఈవో

పీఈటీలకు ప్రత్యేక పోటీలు నిర్వహించాలి



పీఈటీలను ప్రత్యేక జట్లుగా విభజించి పోటీలు నిర్వహించాలి. పీఈటీలను కూడా కలిపి పోటీలు నిర్వహించడం ద్వారా సాధారణ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. పీఈటీలకు ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పుష్పగిరి హుండీ లెక్కింపు

వల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుష్పగిరి క్షేత్రంలో వెలసిన వైద్యనాథ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. 6.5.2025 నుంచి 18.11.2025 వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.8,28,180లు వచ్చిందన్నారు. దేవదాయశాఖ కడప ఇన్‌స్పెక్టరు శివయ్య పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేసినట్లు తెలిపారు. గతంలో కంటే రూ.2,16,718 అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని దేవస్థానానికి చెందిన బ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ సిబ్బంది, పోలీసులు, స్థానిక అర్చకులు పాల్గొన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు కోటిరెడ్డి కళాశాల విద్యార్థుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థినులు సి.పావని, కె.జాహ్నవిలు మనాలిలో ఏబీవీఐఎమ్ ఏఎస్‌లో నవంబరు 22 నుంచి డిసెంబరు 1 వరకు జరిగే నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ (ఎన్‌ఏటీసీ)కి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష తెలిపారు. ఈ క్యాంప్‌లో పాల్గొనడం వలన నాయకత్వం, క్రమశిక్షణ, టీంవర్క్‌వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శశిదేవిలను ప్రిన్సిపాల్ అభినందించారు. యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో మొత్తం పది మంది వలంటీర్లు ఈ అడ్వెంచర్‌క్యాంప్‌నకు ఎంపికయ్యారని, వీరితో కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ కె.లలిత హాజరవుతున్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయికి గంగనపల్లె పాఠశాల విద్యార్థులు

కడప స్పోర్ట్స్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గంగనపల్లె పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి ఈనెల 22, 23, తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి చంద్రావతి వెల్లడించారు.

క్రీడా పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాలికల హ్యామర్ త్రో విభాగంలో పావని అనే క్రీడాకారిణి ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానాన్ని మహబూబ్‌జాన్ సాధించిందన్నారు., అలాగే బాలికల పోల్ వాల్ట్ పోటీలో సాహిదా ప్రథమ విజేతగా నిలువగా ద్వితీయ విజేతగా ముబీనా నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

కాలువల ఆక్రమణలకు మార్కింగ్ ఇవ్వండి

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ఐదు ప్రధాన కాలువలపై ఉన్న ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ ఇవ్వాలని కాలువలకు అప్రోచ్ రోడ్డు వేసి ఎక్స్‌కవేటర్లతో మురుగును ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈఈ డీఈ ఏసీపీ, తహసీల్దార్‌లతో కలిసి కాలువ ఆక్రమణల తొలగింపు, రోడ్ల విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువలు మరోసారి సర్వే పూర్తి చేసి వెంటనే మార్కింగ్ ఇవ్వాలన్నారు. రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వన్ టౌన్ సీఐ తిమ్మారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పెద్దిరెడ్డి (ఫైల్ ఫొటో)

సింహాద్రిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదినంచెర్ల గ్రామానికి చెందిన రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు.. బిదినంచెర్ల గ్రామానికి చెందిన ముత్తులూరు పెద్దిరెడ్డి (47) తనకున్న 5 ఎకరాల పొలంలో చీనీ తోట సాగుచేసేవాడు. పంట సరిగా రాకపోవడం, సాగు చేసేందుకు సమారు రూ.20 లక్షల మేర అప్పులు కావడంతో మనస్తాపానికి గురైన పెద్దిరెడ్డి మంగళవారం గ్రామ సమీపాన గల చెరువు కట్టవద్ద విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టక్కోలిలో కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. టక్కోలిలో నివశిస్తున్న దుంపల వాసంతి (25)కి నాలుగు నెలల కిందట ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ బాధ తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. చిన్నారి ఏడుస్తుండగా కొంతమంది మహిళలు తలుపులు తెరవగా మృతి చెందినట్లు గుర్తించారు. మంగళవారం మృతురాలి అన్న వెంకటమాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన కోడూరు విద్యార్థులు

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఏపీ తైక్వాండో అసోషియేషన్ ఈనెల 15, 16 తేదీల్లో 39వ జూనియర్, 41వ సీనియర్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో రైల్వేకోడూరుకు చెందిన ఎం.చైతన్య ప్రసాద్, జె.నాగమణి, బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం రైల్వేకోడూరు యస్‌వీకే స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు శివాజీ మాట్లాడుతూ సబ్-జూనియర్స్ విభాగంలో పి.నాగచరణ్, జి.అభిరాం సాయివర్మ, ఎ.రాంచరణ్, పి.శ్రీరాం, బాలికల విభాగంలో పి.హర్షిత, కె.నిహారికలు బంగారు పతకాలు, వరుణ్‌కుమార్, వర్షశ్రీ, సుమయ వెండి పతకాలు సాధించారని తెలిపారు. 8 మంది విద్యార్థులు ఈనెల 21 నుంచి 26 వరకు పంజాబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే సీనియర్స్ విభాగంలో డిసెంబరులో జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి సత్యసాయిబాబా శతజయంతి

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను వేంపల్లెలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచ సాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 నుంచి 23వ తేదీ వరకు పలుకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

44 గ్యాస్ సిలిండర్లు సీజ్




పట్టుబడిన సిలిండర్లను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించారు. హోటళ్లు, టీ షాప్‌లు తదితరచోట్ల దాడులు చేసి 44 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. పులివెందుల ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ మంగళవారం తనిఖీలు చేశారు. గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేసి పలు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ద్వారా గ్యాస్ ఏజెన్సీలో అప్పగించారు. సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య అవసరాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో వీఆర్వోలు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి హుండీ ఆదాయం రూ.1.67 లక్షలు

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజస్వామి దేవస్థానంతో మంగళవారం హుండీలను లెక్కించగా రూ.1,.67,396 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యులు శివారెడ్డి, పార్వతమ్మ, ఆలయ సిబ్బంది, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ జాతీయ టోర్నమెంట్‌కు పార్నపల్లె విద్యార్థి



లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు పార్నపల్లె ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి నాగచైతన్య ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16 వరకు రైల్వేకోడూరులో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభకనబరచడంతో 2026 జనవరి నెలలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పంట మార్పిడితో భూమి సారవంతం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో భూమి సారవంతం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిన్నెపాడులో వేరుశనగ, కంది, ఉలవ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి వలన నేలలోని పోషకాలు సమతుల్యం కావడంతో ఏ పంట సాగు చేసినా తెగుళ్లు ఆశించకుండా ఉంటాయన్నారు. అంతేగాకుండా దిగుబడులు పెరిగి పంట నాణ్యత వస్తుందన్నారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో చాలా మంది ఉల వలు ఎక్కువ సాగు చేశారని, పంట ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతం మండలంలో ప్రతి చెరువులో నీరు అందుబాటులో ఉందని రబీలో వేరుశనగతో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రాజకుమారి, ఏపీసీఎఫ్ ఎఫ్ రైతులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : మంత్రి





యువతనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లెకు చెందిన విద్యార్థినులు చేస్తున్న నృత్యం

రామాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా జాతీయ యువజనోత్సవాలను కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువజన శాతం కలిగినది మన దేశమని, వికసిత్ భారత్ 2047 దిశగా దేశాన్ని నడిపించే శక్తి యువత అని తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ జాతీయ యువజనోత్సవాలు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం మంత్రిని కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్, స్టెప్ సీఈవో సుబ్బరాయుడు, బిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏసీ రెడ్డి, త్రినై కాలేజీ ఫార్మా ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఏవో జలజ, అన్ని పాఠశాలల పీటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులేనా...!

● సీఎం సారూ.. స్పందించండి ● రూ.454 కోట్లకు జీవో ఇచ్చిన వైసీపీ సర్కారు
● పరిహారం మాత్రం ఇవ్వని వైనం ● గండికోట నిర్వాసితుల ఆవేదన

కొండాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. రెండేళ్ల కిందట వైసీపీ సర్కారు పునరావాస పరిహారం కోసం జీవో విడుదల చేసినా, ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనికరించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్ల తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం.. నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పునరావాస పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపుగ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.3,25,000 చొప్పున 9,096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.59.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో తెలిపింది. ఈ జీవోకుకు సంబంధించి కనీసం ఒక్కరూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది.

రెండేళ్లుగా ఎదురుచూపులు..

వైసీపీ సర్కారు జీవో విడుదల చేసి గాలికొదిలేయడంతో కూటమి ప్రభుత్వంపైనే నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా పునరావాస పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 22న మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించడంతో పరిహారంపై మరింత ఆశలు పెంచుకున్నారు. పరిహారం తొందరగా ఇచ్చేందుకు కృషిచేస్తామని మంత్రి చెప్పారు. ఆ తర్వాత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి విజయవాడలో నిర్వాసితులు మంత్రి నిమ్మలతో సమావేశమయ్యారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.150 కోట్ల నిధులతో పాటు, మిగిలిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రూ.150 కోట్లను వెంట మంత్రి చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని వెంటనే పరిహారానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు.



ఉపాధ్యాయులకు ఆటలు

● మండలస్థాయిలో 29, 30 తేదీలలో ● డివిజన్ స్థాయి డిసెంబరు 13, 14 తేదీలలో...

● జిల్లాలో 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు ● సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా, మరింత ఉత్సాహంగా బోధన చేసేలా శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా ప్రభుత్వం ఆటలపోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈనెల 16వ తేదీన ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళ టీచర్లకు త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. తొలుత మండల స్థాయి తర్వాత డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ బాధ్యతలను మండలస్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌కు అప్పగించారు.

మండల స్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లాస్థాయిలో డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి జేడీ స్థాయిలో అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండలస్థాయి జట్లను ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్‌జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్లను ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆటలపోటీల వివరాలు

మండలస్థాయిలో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీలలో, జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీలలో రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీలలో నిర్వహిస్తారు. ఈ ఆటల ద్వారా ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వం, ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడిని తగ్గించడం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వినోద కార్యక్రమాలకు వేదికను అందించడంతో పాటు క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. అన్ని కేడర్లలోని ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, స్నేహాన్ని బలోపేతం చేయడం, ఆటలలో చురుకుగా పాల్గొనడంలో విద్యార్థులకు ఒక ఉదాహరణగా నిలిచి వారిని ప్రేరేపించడం ముఖ్య లక్ష్యాలుగా ఈ ఆటలు పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలో 36 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో పాటు, జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి రూ.5వేల చొప్పున 36 మండలాలకు రూ.1.80లక్షలు, ప్రతి డివిజన్‌కు రూ.20వేల చొప్పున మూడు డివిజన్లకు రూ.60వేలు విడుదల చేయనున్నారు. జిల్లాస్థాయిలో పోటీలకు రూ.20వేలు నిర్వహణ బడ్జెట్ కూడా కేటాయించారు. దీనిపై ప్రత్యేక ఉత్తర్వులు విద్యాశాఖ విడుదల చేసింది.

మానసిక ఉల్లాసం కలిగించేందుకు



ఉపాధ్యాయులు అలసట నుంచి బయటకు వచ్చేందుకు ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయం. ఉపాధ్యాయులకు కూడా పోటీతత్వం అలాగే మానసిక ఉల్లాసం శరీర దృఢత్వానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది.

- ఎస్.షంషుద్దీన్, డీఈవో

పీఈటీలకు ప్రత్యేక పోటీలు నిర్వహించాలి



పీఈటీలను ప్రత్యేక జట్లుగా విభజించి పోటీలు నిర్వహించాలి. పీఈటీలను కూడా కలిపి పోటీలు నిర్వహించడం ద్వారా సాధారణ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. పీఈటీలకు ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పుష్పగిరి హుండీ లెక్కింపు

వల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుష్పగిరి క్షేత్రంలో వెలసిన వైద్యనాథ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. 6.5.2025 నుంచి 18.11.2025 వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.8,28,180లు వచ్చిందన్నారు. దేవదాయశాఖ కడప ఇన్‌స్పెక్టరు శివయ్య పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేసినట్లు తెలిపారు. గతంలో కంటే రూ.2,16,718 అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని దేవస్థానానికి చెందిన బ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ సిబ్బంది, పోలీసులు, స్థానిక అర్చకులు పాల్గొన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు కోటిరెడ్డి కళాశాల విద్యార్థుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థినులు సి.పావని, కె.జాహ్నవిలు మనాలిలో ఏబీవీఐఎమ్ ఏఎస్‌లో నవంబరు 22 నుంచి డిసెంబరు 1 వరకు జరిగే నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ (ఎన్‌ఏటీసీ)కి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష తెలిపారు. ఈ క్యాంప్‌లో పాల్గొనడం వలన నాయకత్వం, క్రమశిక్షణ, టీంవర్క్‌వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శశిదేవిలను ప్రిన్సిపాల్ అభినందించారు. యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో మొత్తం పది మంది వలంటీర్లు ఈ అడ్వెంచర్‌క్యాంప్‌నకు ఎంపికయ్యారని, వీరితో కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ కె.లలిత హాజరవుతున్నారని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పెద్దిరెడ్డి (ఫైల్ ఫొటో)

సింహాద్రిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదినంచెర్ల గ్రామానికి చెందిన రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు.. బిదినంచెర్ల గ్రామానికి చెందిన ముత్తులూరు పెద్దిరెడ్డి (47) తనకున్న 5 ఎకరాల పొలంలో చీనీ తోట సాగుచేసేవాడు. పంట సరిగా రాకపోవడం, సాగు చేసేందుకు సమారు రూ.20 లక్షల మేర అప్పులు కావడంతో మనస్తాపానికి గురైన పెద్దిరెడ్డి మంగళవారం గ్రామ సమీపాన గల చెరువు కట్టవద్ద విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టక్కోలిలో కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. టక్కోలిలో నివశిస్తున్న దుంపల వాసంతి (25)కి నాలుగు నెలల కిందట ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ బాధ తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. చిన్నారి ఏడుస్తుండగా కొంతమంది మహిళలు తలుపులు తెరవగా మృతి చెందినట్లు గుర్తించారు. మంగళవారం మృతురాలి అన్న వెంకటమాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

44 గ్యాస్ సిలిండర్లు సీజ్



పట్టుబడిన సిలిండర్లను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించారు. హోటళ్లు, టీ షాప్‌లు తదితరచోట్ల దాడులు చేసి 44 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. పులివెందుల ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ మంగళవారం తనిఖీలు చేశారు. గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేసి పలు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.

స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ద్వారా గ్యాస్ ఏజెన్సీలో అప్పగించారు. సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య అవసరాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో వీఆర్వోలు పాల్గొన్నారు.

బేస్‌బాల్ జాతీయ టోర్నమెంట్‌కు పార్నపల్లె విద్యార్థి



లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు పార్నపల్లె ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి నాగచైతన్య ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16 వరకు రైల్వేకోడూరులో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభకనబరచడంతో 2026 జనవరి నెలలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలపట్ల అవగాహన పెంచుకోవాలని చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్, రామాంజులరెడ్డి, శోభారాణి, శ్రీధర్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి గంగనపల్లె పాఠశాల విద్యార్థులు

కడప స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గంగనపల్లె పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి ఈనెల 22, 23, తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి చంద్రావతి వెల్లడించారు.

క్రీడా పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాలికల హ్యామర్ త్రో విభాగంలో పావని అనే క్రీడాకారిణి ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానాన్ని మహబూబ్‌జాన్ సాధించిందన్నారు., అలాగే బాలికల పోల్ వాల్ట్ పోటీలో సాహిదా ప్రథమ విజేతగా నిలువగా ద్వితీయ విజేతగా ముబీనా నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


నిత్యపూజస్వామి హుండీ ఆదాయం రూ.1.67 లక్షలు

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజస్వామి దేవస్థానంతో మంగళవారం హుండీలను లెక్కించగా రూ.1,67,396 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యులు శివారెడ్డి, పార్వతమ్మ, ఆలయ సిబ్బంది, వంతాటిపల్లె ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి

కొండాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని గండికోట నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు కోరారు. మంగళవారం తహసీల్దార్ గురప్పకు వారు వినతిపత్రం అందజేశారు. గండికోట పునరావాస పరిహారం అందక 22 ముంపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారని గత వైసీపీ ప్రభుత్వం లో రాత్రికి రాత్రే ఇళ్లు ఖాళీచేయించి ప్రాజెక్టులో నీళ్లు నింపారని, అయినా ఇంతవరకు పరిహారం చెల్లించలేదని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి,సుబ్బారావు, జయంతు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నరసింహస్వామికి స్వాతీ నక్షత్ర పూజలు


పుష్పాలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరసింహాపురంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతీనక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాలతో అభిషేకించి నూతన వస్త్రాలు, వెండి కవచాలు, రంగు రంగుల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. బాలాజీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

ముక్తిరామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో తిరుణాళ్ల సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గంగరాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

మరకత లింగానికి అన్నాభిషేకం

మైదుకూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని లక్ష్మీమాధవరాయస్వామి ఆలయంలో మంగళవారం మరకత లింగానికి నిర్వాహకులు అన్నాభిషేకం నిర్వహించారు. నందికి, శివలింగానికి ఏక కాలంలో పూజలు జరిగాయి.ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడు బండి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.


ఆస్పత్రిలో దంత సేవలు గగనం

- పన్ను పుచ్చితే పీకివేయడం తప్ప చికిత్సలేదు
- ఎక్స్‌రే మిషన్‌కు సెన్సార్ లేక మూలనపడిన వైనం
- జాడలేని రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్
- దీర్ఘకాల సెలవుల్లో వైద్యురాలు
- జూడాలతో అరకొర సేవలు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో దంత సేవలు గగనంగా మారాయి. ఆస్పత్రిలోని దంత వైద్య విభాగంలో సరైన సదుపాయాలు లేకపోగా రెగ్యులర్ డాక్టర్ దీర్ఘకాలిక సెలవు ల్లో వెళ్లడంతో కడప నుంచి వచ్చే జూనియర్ డాక్టర్లు అందించే అరకొర సేవలే రోగులకు మహాభాగ్యంగా మారింది. పన్ను పుచ్చితే నయం చేయాల్సిందిపోయి పీకేస్తున్నారు. కేవలం దంత శుభ్రత, పుచ్చిన పన్నును తొలగించడం మినహా ఇక్కడ మరెలాంటి సేవలు అందడంలేదు. జిల్లా ఆస్పత్రిలో మూడు డెంటల్ బెంచీలతో కూడిన దంత వైద్య విభాగం ఉంది. ఇక్కడికి నిత్యం 30 నుంచి 50 మంది దంత సమస్యలతో వస్తుంటారు. దంత సమస్యలు ఉన్నవారికి నొప్పికి మందులు రాయడం, కొద్దో, గొప్పో సిమెంటుతో కూడిన చికిత్స చేస్తున్నారు. పన్ను పుచ్చితే తీసివేయడం మినహా ఇతర సేవలు గగనం అవుతున్నాయని రోగులు వాపోతున్నారు. పైగా ఇక్కడి రెగ్యులర్ డాక్టర్ శ్రీలక్ష్మి రెండు నెలలపాటు సెలవుల్లో వెళ్లారు. దీంతో కడప నుంచి సిఫ్టల ప్రాతిపదిక మీద జూనియర్ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు.

డెంటల్ సెన్సార్ లేక..: రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌కు కీలకపాత్ర వహించే ఎక్స్‌రే మిషన్, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నా దీనికి సెన్సార్ అనే చిన్న పరికరం లేకపోవడంతో దానిని మూలన పడవేశారు. పన్ను మూలాలను విశ్లేషించే సెన్సార్ లేకపోవడంతో చాలా కాలంగా ఇక్కడ రూట్‌కెనాల్ సేవలు నిలిపివేశారు. ఇలాంటి సేవలు కావాలంటే కడపలోని రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. లేదంటే రోగులు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

కట్టుడు పళ్ల కథ కంచికి..: కడపలోని మెడికల్ కళాశాలలో డెంటల్ ల్యాబ్‌కు అనుసంధానంగా ఇక్కడి జిల్లా ఆస్పత్రిలో ఏడాదిన్నర కిందన్యాక్ ల్యాబ్ ప్రభుత్వంతో కాంట్రాక్టు పద్ధతిన కట్టుడు పళ్లకు కొంత కాలం సేవలు అందించారు. ఎవరికైనా ఒకటి లేదా రెండు దంతాలకు తీసి పెట్టుకునే క్యాప్‌లు అమర్చడం, కృత్రిమ పళ్ల సెట్లు అమరిక కోసం స్థానికంగా కొలతలు వేసి కడపలోని ల్యాబ్‌కు పంపించాలి. కృత్రిమ దంతాలు తయారు అయి వచ్చిన తర్వాత రోగులకు వాటిని అందించే వెసులుబాటు ఉంది. కానీ బిల్లులు సకాలంలో చెల్లించడంలేదని న్యాక్ లాబ్ తమ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో కట్టుడుపళ్ల కథ కంచికి చేరినట్లు అయింది.


ఎక్స్‌రే మిషన్‌కు సెన్సార్ లేక మూలనపడిన యంత్రం

ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏమన్నారంటే: ఈ విషయమై జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా వైద్యురాలు సెలవులో ఉన్న విషయం వాస్తవమన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శిక్షణకు వెళ్లిన ఎంపీడీవో

చాపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండల ఎంపీడీవో వీరకిశోర్ ఈనెల 22వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా పట్టణానికి శిక్షణకోసం వెళ్లినట్లు ఏవో రామానుజన్ తెలిపారు. రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన తెలుసుకునేందుకు వెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం ఎంపీడీవోలను శిక్షణ కోసం పంపినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ముద్దనూరు నవంబర్18(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా జోనల్ మలేరియా అధికారి నిర్మల్ అలెగ్జాండర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆయన ఆరోగ్య కేంద్రంలోని పరిసర ప్రాంతాలు,గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్‌యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులరెడ్డి,సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

కలసపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసే ప్రతి రైతు విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం కలసపాడు మండల పరిధిలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం లో వరిపంటను పరిశీలించి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. రైతులందరూ ఈ-పంటను నమోదు చేసుకుంటే ప్రభుత్వపరంగా లబ్ధిపొందవచ్చన్నారు.

పెద్దముడియంలో : శెనగపంట సాగు చేసే ప్రతి రైతు విత్తనశుద్ధి చేయాలని వ్యవసాయ సహాయకుడు శివమోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని భూతమాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో సమావేశమైన వ్యవసాయాధికారులు పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పెద్దముడియం మండలంలో శెనగ పంట సాగవుతుందని, రైతులు ప్రధానంగా విత్తనశుద్ధి చేపడితే తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు.

ప్రభుత్వ గృహం.. అక్రమ అడ్డాలకు నిలయం

- జిల్లేళ్లలో ఇటీవల రేషన్‌బియ్యం పట్టుబడినది ఇక్కడే



దువ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామంలో గతంలో వయోజన విద్యా కేంద్రంగా నిర్వహించిన ప్రభుత్వ గృహం అక్రమ అడ్డాలకు నిలయంగా మారింది. 15 ఏళ్ల కిందట నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించే నిమిత్తం దీనిని ఉపయోగించేవారు. తదనంతరం పెంకుటిల్లుతో కూడిన ఈ గృహాన్ని ఖాళీగా వదిలేశారు. ఈ నేపథ్యంలో ఇదే అదునుగా భావించి అక్రమార్కులు కొందరు ఇందులో అడ్డగోలు వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ దాడుల్లో ఈ గృహంలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అయితే ఇందులో ఎవరు నిలువ ఉంచారనే విషయం అంతుచిక్కలేదు. ఈ దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో అక్రమార్కుని ఆచూకీ లభ్యం కాలేదు. మొత్తంగా ఈ గృహాన్ని అధికారులు ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దీనిలో నిత్యం అక్రమంగా చౌక దుకాణాల బియ్యం నిలువ విషయంపై రెవెన్యూ శాఖ దృష్టి సారిస్తే సమాచారం లభ్యం కావడం పెద్ద కష్టమేమీ కాదని ప్రజలు అంటున్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

బద్వేలు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల భూమి సారవంతమవుతుందని ఏవో సాయిజ్యోతి అన్నారు. స్కూల్‌సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏవోలు మంగళవారం స్థానిక కోటవీధిలో ఉన్న జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష కేంద్రం ఏవో భారతి మాట్లాడుతూ మట్టి నమూనా సేకరించినప్పుడు యాప్‌లో డేటా పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి

పోరుమామిళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మేజరు పంచాయతీ గృహ యజమానులు ఇంటి పన్ను బకాయిలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి ఓబులేసు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలన్నారు. పోరుమామిళ్ల పంచాయతీలో దాదాపు 55వేలకు పైగా నివాసగృహాలు ఉన్నాయని వారందరూ సకాలంలో ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు.

పన్ను బకాయిలు చెల్లించండి

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించడం వలన మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించినవారవుతారన్నారు. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయరాదని సూచించారు. ఎక్కడైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు.

'ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలి'

బద్వేలు, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్థులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని టీడీపీ నేత ముదిరాజ్ సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రభుత్వాని కి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన బద్వేలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నవ్యాంధ్రలో అత్యంత వెనుకబడిన ముదిరాజ్‌సామాజిక వర్గాన్ని బీసీఏలో చేర్చాలని ఇందుకు సంబంధించి మంత్రులు కేబినేట్‌లో చర్చించాలని ఆయన డిమాండ్‌చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బద్వేలు, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల కోసం ఏర్పాటు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవళి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు జీవో 14 ద్వారా బార్బర్లందరికీ 200 యూనిట్ల విద్యుత్‌తో పాటు ఆదరణ -3 పథకం ద్వారా ఆధునిక పనిముట్లకు వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు వి. గురుబ్రహ్మం, ఎం. వెంకటసుబ్బయ్య, కె.ప్రసాద్, బాబు, ఎస్.హరి, డి. మహేష్ పాల్గొన్నారు.

హైలెవెల్ వంతెనకు అటవీ భూముల సేకరణ


ఫారెస్టు భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ ఫారెస్టు, ఆర్‌అండ్‌బీ అధికారులు

ప్రొద్దుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెనకు అటవీ భూముల సేకరణకై రెవెన్యూ, ఫారెస్టు, ఆర్‌అండ్ బీ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మంగళవారం ఆర్‌టీపీపీ మార్గంలో పెన్నానది మీద నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన పూర్తిచేయడానికి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఫారెస్టు భూముల వివాదం కొలిక్కి రావడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు 48సెంట్లు హైలెవెల్ వంతెనకోసం ఫారెస్టు భూముల కోసం ప్రతిపాదన పంపారు. అలాగే అప్రోచ్ రోడ్డుకోసం కూడా మరో 60 సెంట్లు కావాల్సి ఉంది. వాటిపై రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఫారెస్టు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటవీ భూములను త్వరగా క్లియర్ చేయనిదే వంతెన పనులు పూర్తి కావని త్వరితగతిన క్లియర్ చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. తహసీల్దారు గంగయ్య, ఫారెస్టు రేంజ్ అధికారిణి హేమాంజలి, ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీ నరసింహులు, సర్వేయర్ వెంకటలక్ష్మీ, వీఆర్‌వో ప్రేమ్ సాయి ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో నలుగురికి గోల్డ్‌మెడల్స్

దువ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో దువ్వూరు క్రీడాకారులు నలుగురు గోల్డ్‌మెడల్స్‌తో పాటు ఒక బ్రాంజ్‌మెడల్ సాధించారు. ఈనెల 16, 17తేదీల్లో ఈ పోటీలు జరిగినట్లు తైక్వాండో మాస్టర్ సుధీర్‌కుమార్ మంగళవారం తెలిపారు. షిర్డిసాయి హైస్కూలుకు చెందిన సంజీవలహరి, నాగశ్రీచరణ్, రామ్‌హేమంత్‌కుమార్‌తోపాటు సీనియర్ విభాగంలో సుధీర్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించగా నవీన్‌కుమార్ బ్రాంజ్‌మెడల్ గెలుపొందారు. డిసెంబరులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


ఖాజీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): త్రిపురవరం గ్రామంలో నిర్వహించే సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో దివిజా సంపతి అన్నారు. మంగళవారం త్రిపురవరం సచివాలయంలో స్వమిత్ర సభపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ కంఠంలో ఏర్పాటు చేసుకున్న 9 గృహాలకు సర్వే నిర్వహించి వారికి నోటీసులు అందజేయాలన్నారు. డిజిటల్ అభివృద్ధి అధికారి మేథిలి, పీఏసీఎస్ ఛైర్మన్ హరినాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకేశవ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : రితేష్


సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పేదలకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. గోపవరం మండలం, కాలువపల్లె పంచాయతీకి చెందిన ఉప్పత్తివారిపల్లె, లక్కవారిపల్లె, కాలువపల్లె, ఎర్రచిన్నాయపల్లెకు సంబంధించిన పసుపులేటి రమణయ్య, బాల వెంకటేష్, ముద్రల వేమయ్య, అడుగంట్ల వెంకటేశ్వర్లు, తుపాకుల సావిత్రి, లకిడి రవి, పెద్దరామయ్య, జయమేరి, నాగరత్నమ్మలకు రూ.3.50లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకంకావాలి


మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

కాశినాయన నవంబరు18(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బహు జనులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని భారతీయ చైతన్య యువజన (బీసీవై)పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నవరం సమీపం లోని శివాలయంలో నిర్వహించిన కార్తీక యాదవ వన మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ బహుజనుల బతుకులు బాగుపడాలంటే రాజకీయ ప్రత్యామ్నాయం తప్పదన్నారు. అందుకోసమే రాష్ట్రంలో బీసీవై పార్టీని స్థాపించి అలుపెరగని పోరాటం చేస్తున్నాన్నారు. కార్యక్రంలో యాదవ సంఘం నాయకులు శ్రీనివాస యాదవ్, పోలు మురళీ యాదవ్, నరసింహ యాదవ్, ముట్టి చెన్నయ్య యాదవ్, నరసింహ యాదవ్, యాదవ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను టెట్‌నుంచి మినహాయించండి

బద్వేలు, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు గల ఉపాధ్యాయులను టెట్‌నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డిలకు మంగళవారం ఉపాధ్యాయులు వేర్వేరుగా వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ టెట్ అనేది ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు గుదిబండలా మారిందని, విద్యాహక్కు చట్టం 2009 తర్వాత ఉపాధ్యాయులుగా నియామకాలు పొందిన వారికి టెట్ అవసరం లేదన్నారు. ఎస్టీయూ అధనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రమణ్యం, రాష్ట్ర కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో జీవనోపాధులు చేపట్టాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల ద్వారా డ్వాక్రా సంఘం మహిళలు తీసుకున్న రుణాలతో జీవనోపాధులు పెంపొందించుకోవాలని వెలుగు జిల్లా ప్రాజక్టు మేనేజరు ధనుంజయ తెలిపారు. మంగళవారం బ్రహ్మంగారిమఠం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కమ్యునిటీ కోఆర్డినేటర్లు, అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిరాణా కొట్లు పాడిపరిశ్రమ, చేపల పెంపకం, కొవ్వొత్తుల తయారీ, టిఫిన్ సెంటర్లు, పొట్టేలు పిల్లల పెంపకం వంటి వాటిని చేపట్టాలని డీపీఎం .తెలిపారు.

ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య కోరారు. మండలంలో ఏర్పాటు చేసిన కలమల్ల, చిలమకూరు సెంటర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. చిలమకూరులో సర్వర్‌రాకపోడం, అనుభవం లేని వారికి ట్రైనింగ్ ఇచ్చి సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయాన్ని కాపాడాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి బి.సుబ్బరాయుడులు పేర్కొన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించాలి

కాశినాయన నవంబరు18 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగకుండా విద్యుత్ ను అందిచాలని ట్రాన్స్‌కో మైదు కూరు డివిజన్ ఈఈ లక్ష్మీపతి పేర్కొన్నారు. మంగళవారం ఆయ న నర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పోరుమామిళ్ల ట్రాన్స్‌కో ఏడీ రవి చంద్రతో కలిసి తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌ను పరిశీలించి కార్యాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను ఇతర వివరాలను ఏఈ సుబ్బరాయుడును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ వెంక టరమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నలూరులో స్వచ్ఛభారత్

మైదుకూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నలూరు గ్రామంలో మంగళ వారం తిరుపతి వెంకటేశ్వర అగ్రి కల్చర్ నాల్గవ సంవత్సరం చదువు తున్న విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామం లోని రైతు సేవ కేంద్రం సచివా లయం ప్రాంగణం వద్ద చెత్త చెదారాలను తీసివేసి శుభ్రపరిచారు. కార్యక్రమంలో డాక్టర్ వాణి, అన్నలూరు సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

